

పెద్దిరెడ్డిపై తిరుగుబాటు

- పుంగనూరుకు వస్తే అడ్డుకుంటామంటూ టీడీపీ, జనసేన ధర్నా
- వైసీపీ రెచ్చగొట్టే వ్యాఖ్యలతోనే ఆందోళన చేస్తున్నామన్న నేతలు


పుంగనూరు, జూన్ 15 : నెలక్రితం వరకు పుంగనూరునే కాదు రాయలసీమను కూడా అధికార బలంతో శాసించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై తిరుగుబాటు మొదలైంది. 15 ఏళ్లుగా పుంగనూరు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పనిచేసిన ఆయన నియంతలా వ్యవహరిస్తూ వచ్చారన్న విమర్శలను మూటగట్టుకున్నారు. సీఎం జగన్ క్యాబినెట్‌లో అధిక ప్రాధాన్యత ఉండటంతో ప్రతిపక్షాలను అణిచివేయడమే కాక, ఎదురుతిరిగిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురిచేశారు. నియోజకవర్గంలో పెద్దిరెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడాలన్నా ప్రజలు, ప్రత్యర్థి పార్టీ శ్రేణులు భయపడే స్థాయికి పరిస్థితులు చేరాయి.

చల్లా రామచంద్రారెడ్డి పర్యటన అడ్డగింత..

గత ఐదేళ్లలో పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పార్టీ కార్యక్రమాల నిర్వహణకు నియోజకవర్గంలో పర్యటించా లంటే పోలీసులు అనేక ఆంక్షలు పెట్టి అడ్డుకునేవారు. బాధితులుగా ఉన్న టీడీపీ వారిపైనే కేసులు పెట్టారు. సోమల మండలంలోని సోమల, నంజంపేటలో చల్లా బాబు కారుపై వైసీపీ శ్రేణులు దాడి చేశాయి. రొంపిచెర్లలో చల్లా బాబు జన్మదినం సందర్భంగా టీడీపీ అభిమానులపై వైసీపీ నేతలు దాడులు చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు పుంగనూరు పర్యటననూ అడ్డుకున్నారు. పుంగనూరుతో పాటు జిల్లాలో ఎక్కడా చంద్రబాబును తిరగనీయబోమంటూ రెచ్చగొట్టారు. ఆ సమయంలో టీడీపీ శ్రేణులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు. ఆ భారీ విధ్వంసంలో పోలీసు వాహనాలు దగ్ధమయ్యాయి. పోలీసులు, టీడీపీ శ్రేణుల మధ్య జరిగిన దాడుల్లో ఇరువర్గాల వారూ గాయపడ్డారు. ఈ ఘటనపై చల్లా రామచంద్రారెడ్డితో పాటు 498మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలపై 12 కేసులు నమోదు చేశారు. అందరిపై 307 కేసులు పెట్టి జైళ్లకు పంపి వేధించారు. దాదాపు నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీలకు చెందిన 1000 మందిపై వివిధ రకాల కేసులు నమోదయ్యాయి. పెద్దిరెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు ఏకపక్షంగా బాధితులపైనే కేసులు పెట్టి వేధించారు.

బీసీనేత పార్టీ అధినేత ఇంటిపై దాడి..

పుంగనూరులో బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ ఇంటిపై గతంలో వైసీపీ మూకలు దాదాపు 300 మంది దాడి చేసి వాహనాలతో పాటు ఇంటిని ధ్వంసం చేశారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో సదుం మండలం ఎర్రాతివారిపల్లెలో రామచంద్ర యాదవ్‌పై దాడి చేసి 17 వాహనాలను ధ్వంసం చేశారు.నాలుగు వాహనాలు కాల్చివేశారు.


వెంకటరెడ్డియాదవ్ ఇంటి వద్ద టీడీపీ నేతలు

చంద్రబాబును అడ్డుకున్నందుకే.....

ఏడాది క్రితం ప్రతిపక్ష నేత చంద్రబాబును పుంగనూరు రాకుండా పెద్దిరెడ్డి అనుచరులు అడ్డుకున్న విషయాన్ని టీడీపీ మండలాధ్యక్షుడు మాధవరెడ్డి, దేశాది ప్రకాశ్ గుర్తు చేశారు. ఐదేళ్లలో 500 మంది టీడీపీ నేతలపై 307 కేసులు పెట్టి జైళ్లకు పంపి హింసించారంటూ మండిపడ్డారు. పుంగనూరు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి, వైసీపీ నాయకుల అక్రమాలు, అరాచకాలు, భూదందాలను నిలపకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. చంద్రబాబును అడ్డుకున్న పెద్దిరెడ్డి, వైసీపీ నాయకులు పుంగనూరులో తిరగడానికి తమ పార్టీ కూడా అనుమతించబోదన్నారు.


రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న టీడీపీ శ్రేణులు

నామినేషన్లు వేయకుండా ప్రజాస్వామ్యం ఖూనీ..

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ వారు నామినేషన్లు వేయకుండా రిటర్నింగ్ అధికారుల ముందే నామినేషన్లను వైసీపీ శ్రేణులు లాక్కెళ్లడం, చింపేయడం చేశారు. ఈ విధంగా పుంగనూరు నియోజకవర్గం రాష్ట్రంలోనే అరాచకాలకు పరాకాష్టగా మారింది. ఈ నేపథ్యంలో జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘనవిజయంతో టీడీపీ, జనసేన శ్రేణుల్లో మనోధైర్యం పెరిగింది. ఇన్నాళ్లు పడ్డ బాధలూ, అవమానాలూ గుర్తుకొచ్చాయి. వైసీపీ సమావేశానికి హాజరయ్యేందుకు శనివారం పుంగనూరుకు పెద్దిరెడ్డి వస్తున్నారని తెలిసింది. స్థానిక టీడీపీ, జనసేన నేతలు పెద్దయెత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా పుంగనూరుకు వస్తే అడ్డుకుంటామంటూ రోడ్డుపై బైఠాయించారు. 'పెద్దిరెడ్డి గోబ్యాక్' నినాదాలతో పుంగనూరును హోరెత్తించారు. జడ్పీ గెస్ట్‌హౌస్ నుంచి అంబేడ్కర్ సర్కిల్‌కు చేరుకుని చిత్తూరు-మదనపల్లె రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు. అక్కడి నుంచి ఎన్టీఆర్ సర్కిల్, ప్రైవేటు బస్టాండ్, ఇందిరాసర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కాగా, ర్యాలీ సమయంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన వైసీపీ నాయకుడు గోపియాదవ్‌కు దేహశుద్ధి చేశారు. మధ్యలో వైసీపీ నాయకుడు వెంకటరెడ్డి యాదవ్ ఇంటివద్ద బయటకు రావాలని కేకలు వేస్తూ రాళ్లు విసిరారు. కొందరు నేతలు శ్రేణులను నిలువరించినా వారు ఆవేశంతో 'మాపై వైసీపీ ప్రభుత్వంలో అనవసర కేసులు పెట్టి, కుటుంబాలను రోడ్డున పడేశారు' అంటూ ఇంట్లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులను అడ్డుకుని అక్కడి నుంచి పంపించేశారు. ఈడిగపల్లె వద్ద మాజీ ఎంపీపీ నరసింహులు వస్తుండగా టీడీపీ శ్రేణులు దాడి చేయబోగా పార్టీ నేత మాధవరెడ్డి వారించారు. టీడీపీ నేతలు సీవీరెడ్డి, పోలీస్ గిరి, సుబ్రహ్మణ్యం రాజు, కుమార్, గంగాధర్, రమణ, రామయ్య, వెంకటరమణ,డీకే శ్రీనివాసులు, ఇమ్రాన్, చిన్న మోహన్ నాయుడు, పెద్ద మోహన్ నాయుడు, సుబ్బన్న, గంగులప్ప, మోహన్‌రెడ్డి, మణి, నవీన్, దామోదర్, జనసేన నాయకులు పడగాల రమణ, విరూపాక్షి, హరినాయక్, శ్రీనివాసులు, వెంకటేశ్ పాల్గొన్నారు.


వైసీపీ రెచ్చగొట్టే వ్యాఖ్యలతోనే నిరసన : టీడీపీ

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వస్తున్నారని, టీడీపీ వారి కథ చూస్తామని వైసీపీ నాయకులు ఎంపీపీ భాస్కర్ రెడ్డి, వెంకటరెడ్డియాదవ్, కొండేటి నాగభూషణం అనుచరులు రెచ్చగొట్టేలా బూతులు మాట్లాడటంతో నిరసనకు దిగాల్సి వచ్చిందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ పేర్కొన్నారు. 'మా ఎమ్మెల్యే వస్తున్నారు, ధైర్యం ఉంటే రోడ్డుపైకి రావాలి' అని బహిరంగ సవాలు విసరడంతో రావాల్సి వచ్చిందని తెలిపారు.

పర్యటన వాయిదా వేసుకున్న పెద్దిరెడ్డి

పుంగనూరులో టీడీపీ, జనసేన శ్రేణుల ఆందోళనల నేపథ్యంలో శనివారం పెద్దిరెడ్డి పర్యటన వాయిదా వేసుకున్నారు. పోలీసుల సూచనలతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే పుంగనూరు, మదనపల్లెకు రావాల్సిన ఎంపీ మిథున్‌రెడ్డి తిరుపతి నుంచి సదుంకు వచ్చి చౌడేపల్లె నుంచి బోయకొండ మీదుగా మదనపల్లె వెళ్లారు.

బదిలీల్లోనూ బాదేశారు..



టీచర్ల నుంచి రూ.లక్షల్లో వసూలు చేసిన వైసీపీ నేతలు

బదిలీల రద్దుతో ఆందోళనలో 148 మంది ఉపాధ్యాయులు

చిత్తూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు వైసీపీ నాయకులు టీచర్ల వద్ద రూ.లక్షల్లో ముడుపులు తీసుకుని బదిలీ చేయించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 148 మంది టీచర్ల వద్ద డబ్బు తీసుకుని ఏప్రిల్‌లో బదిలీ ఉత్తర్వులు తెప్పించారు. ఈ విషయం బహిర్గతం కావడంతో అక్రమ బదిలీలుగా అప్పట్లో ప్రతిపక్షాలు ఆరోపించాయి. రద్దు చేయాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందే ఈ బదిలీలను రద్దు చేస్తూ ఈ మధ్య విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో డబ్బులిచ్చి బదిలీ ఉత్తర్వులు పొందిన 148 మంది టీచర్ల ఆర్డర్లు రద్దయ్యాయి. ఒక్కో బదిలీకి సగటున రూ.4 లక్షలు తీసుకున్న వైసీపీ ప్రజాప్రతినిధులు ఇప్పుడు ముఖం చూపించడం లేదు. అటు బదిలీ అవ్వక, ఇటు డబ్బులు అందక బాధిత టీచర్లు లబోదిబోమంటున్నారు.

వైసీపీ విధానాల వల్లే బదిలీలు కోరిన టీచర్లు

వైసీపీ ప్రభుత్వం 117 జీవో తీసుకొచ్చి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను స్థానిక ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం.. అందులోని టీచర్ పోస్టులను రద్దు చేయడం తెలిసిందే. అలా పోస్టులు రద్దయిన టీచర్లను గతంలో జరిగిన బదిలీల్లో దూరంగా వేశారు. వారిలో కొందరు కుటుంబ పరిస్థితులు, ఆరోగ్య సమస్యలు వంటి కారణాలతో తిరిగి అదే మండలానికి రావాలని కోరుకున్నారు. వారి అవసరాన్ని అదునుగా భావించి వైసీపీ నాయకులు రూ.లక్షల్లో వసూలు చేశారు.

రూ.6 కోట్ల వసూలు

బదిలీ అవసరమైన టీచర్ల నుంచి ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు రూ.6 కోట్లు వసూలు చేసినట్లు ఓ అంచనా. విద్యాశాఖ మంత్రి పేషీలో, సీఎంవోలో పరిచయాలు ఉన్నవారు ఈ వ్యవహారాన్ని డీల్ చేశారు. జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలంతా ఇందులో భాగస్వాములై ఉన్నట్లు సమాచారం. ఒక్కో టీచర్ నుంచి రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు వసూలు చేసినట్లు బాధితులు చెబుతున్నారు.

భర్తకు తోడుగా ఉందామని..

తిరుపతిలో నివాసముంటున్న ఓ మహిళా టీచర్ నగరి నియోజకవర్గంలోని పాఠశాలలో పనిచేస్తున్నారు. టీచర్ అయిన ఆమె భర్తకు ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. దీంతో భర్తకు దగ్గరగా ఉండాలని భావించి బదిలీ కోసం ఓ అధికార పార్టీ ప్రజాప్రతినిధిని ఆశ్రయించారు. విద్యాశాఖ మంత్రి పేషీలో ప్రయత్నించి రూ.3.50 లక్షలకుపైగా ఖర్చు పెట్టుకున్నారు. ఎట్టకేలకు ఏప్రిల్‌లో బదిలీ ఉత్తర్వులు సాధించారు. తాజాగా అవి రద్దు కావడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

రూ.4 లక్షలకు వడ్డీ కడుతున్న మహిళా టీచర్

జీడీనెల్లూరు నియోజకవర్గంలో పనిచేసే ఓ మహిళా టీచర్ 117 జీవో కారణంగా పనిచేస్తున్న పాఠశాలలో పోస్టు రద్దు కావడంతో బదిలీకి అయ్యారు. అదే మండలంలో పనిచేస్తున్న ఆమె భర్తను, కుటుంబాన్ని వదిలి పలమనేరు నియోజకవర్గంలోని ఓ పాఠశాలలో చేరారు. దూర ప్రాంతం కావడంతో రోజూ ప్రయాణం చేయలేక, 7వ తరగతి చదువుతున్న కుమారుడిని తోడుగా ఉంచుకుని పలమనేరులో అద్దెకు ఉంటూ విధులకు వెళ్లి వచ్చేవారు. ఆరు నెలల కిందట ప్రమాదానికి గురై మంచానికే పరిమితమైన మామ, వృద్ధాప్యంలో ఉన్న అత్తను చూసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఎలాగైనా ఇంతకు ముందు పనిచేస్తున్న మండలానికి బదిలీ కావాలని ఉన్నతాధికారుల చుట్టూ తిరిగారు. లాభం లేకపోయింది. అధికార పార్టీకి చెందిన ఓ నేతను సంప్రదించగా రూ.4 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. ఆ మేరకు డబ్బు వడ్డీకి తెచ్చి ఏప్రిల్‌లో బదిలీ ఉత్తర్వులు సాధించారు. కుటుంబానికి దగ్గరగా వచ్చానని సంతోషించే లోపే ఆ బదిలీలు రద్దు కావడం, వైసీపీ నేత రూ.4 లక్షల ప్రస్తావన తేకపోవడంతో ఆమె ఆవేదన చెందుతున్నారు. నెల నెలా వడ్డీ కట్టుకుంటున్నారు.



చంద్రన్నా ... మా మొర ఆలకించన్నా..!

- పెన్షనర్లనూ వదలని వైసీపీ ప్రభుత్వం
- ఐదేళ్లలో విడతలవారీగా పథకాల రద్దు
- అలవెన్సుల విషయంలోనూ అన్యాయమే
- ఈహెచ్‌ఎస్ లేకుండా చేసిన వైనం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 15: గత ఐదేళ్లలో అది చేశాం... ఇది చేశామంటూ ప్రగల్భాలు పలికిన వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాలను నట్టేట ముంచింది. పెన్షనర్లను సైతం వదిలిపెట్టలేదు. వారికి రావాల్సిన అలవెన్సులను పెండింగ్‌లో పెట్టింది. సంక్షేమ పథకాలను అటకెక్కించింది. కొత్తగా ఏర్పడిన చంద్రన్న ప్రభుత్వమైనా తమను ఆదుకోవాలని జిల్లా పెన్షనర్లు కోరుతున్నారు.

పత్తాలేని ఈహెచ్‌ఎస్

జిల్లావ్యాప్తంగా గెజిటెడ్, నాన్-గెజిటెడ్ పెన్షనర్లు 12,505 మంది ఉన్నారు. ఈహెచ్‌ఎస్‌కు సంబంధించిన నగదును సంబంధిత ఆస్పత్రులకు వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్ల కాలంలో ఒక్క పైసా కూడా చెల్లించలేదు. దీంతో ఆయా ఆస్పత్రులు ఈహెచ్‌ఎస్‌ను అమలుచేయలేమని చేతులెత్తేశాయి. సొంత ఖర్చులతో వైద్యం చేసుకుంటున్నామని పెన్షనర్లు వాపోతున్నారు.

డీఆర్ కోసం ఎదురుచూపులు

సాధారణంగా సర్వీసులో ఉండే ఉద్యోగులకు డీఏలు ప్రభుత్వం అందిస్తాయి. ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్లకు డీఆర్ (డియర్‌నెస్ అలవెన్స్) అందిస్తారు. 2018 జూలై 1 నుంచి ఇప్పటివరకు డీఆర్‌లు, అరియర్స్ రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల ఖాతాలకు జమచేయలేదు. ఇక పీఆర్సీ అనే పదాన్నే మరచినట్లు పలువురు పెన్షనర్లు వాపోతున్నారు.

దహనసంస్కారాలకు అందని సాయం

పెన్షనర్లు ఎవరైనా మరణిస్తే జీవిత భాగస్వామికి లేదా నామినీకి తక్షణ దహన సంస్కారాల కింద రూ.10 వేలు నుంచి రూ.15వేలు అందించేది. వైసీపీ ప్రభుత్వం ఈ పథకానికి మంగళం పాడి, అన్యాయానికి గురిచేసిందని పెన్షనర్లు వాపోతున్నారు.

క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌తో అన్యాయం

క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌తో ప్రభుత్వ పెన్షనర్లు ఐదేళ్లకోసారి తమ పెన్షన్లు బట్టి 10శాతం నగదును పొందేవారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 70 ఏళ్ల వారికి 10శాతం, 75ఏళ్లకు 15శాతం, 80ఏళ్లకు 20శాతం, 85ఏళ్లకు 25శాతం, 90 ఏళ్లకు 30శాతం, 95ఏళ్లకు 40శాతం, వందేళ్లు మించిన వారికి 45శాతం చొప్పున క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ అందించేది. దాన్ని సైతం వైసీపీ ప్రభుత్వం లాగేసుకుంది. క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ శాతాన్ని పెంచకపోగా, తగ్గిస్తూ పెన్షనర్లకు అన్యాయం చేసింది.

మా ఉసురు తగిలింది



వైసీపీ ప్రభుత్వానికి మా ఉసురు తగిలి తగిన మూల్యం చెల్లించుకుంది. పెన్షనర్లు ఎంత క్షోభకు గురయ్యారో, ఎంత బాధపడ్డారో కళ్లారా చూశాం. మాకు అమలయ్యే పథకాలను సైతం ఆపేసి అన్యాయం చేసింది. ఓట్ల రూపంలో మా నిరసన తెలియజేశాం.

- ఎన్.కేశవులు, జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, చిత్తూరు

శాంతియుత వాతావరణంలో బక్రీద్

- కలెక్టర్, ఎస్పీ సూచన

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 15: శాంతియుత వాతావరణంలో సోమవారం బక్రీద్ పండుగ జరుపుకోవాలని కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ మణికంఠ కోరారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ముస్లిం మతపెద్దలు, వివిధ శాఖల అధికారులతో వారు సమావేశమయ్యారు. పండుగను పురస్కరించుకుని జంతువులను వధించినా, అక్రమంగా తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మసీదుల వద్ద పారిశుధ్య పనులు చేపట్టేలా మున్సిపల్ కమిషనర్లు, డీపీవోలకు ఆదేశాలిచ్చామన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేశామని చెప్పారు. సమావేశంలో డీఆర్వో పుల్లయ్య, ట్రైనీ కలెక్టర్ హిమవంశి, జడ్పీ సీఈవో గ్లోరియా, డీపీవో లక్ష్మి, చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ముస్లిం మతపెద్దలతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

శపథం నెరవేరింది... పాదరక్షలు ధరించారు

గుడిపాల, జూన్ 15: మండలంలోని కోటూరు గ్రామానికి చెందిన వాసుదేవరెడ్డి టీడీపీ వీరాభిమాని. గత సంవత్సరం చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యేవరకు పాదరక్షలు ధరించనని శపథం చేశారు. ఎన్నికలు ముగిసి, సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టడంతో శనివారం పాదరక్షలు ధరించి, స్వీట్లు పంపిణీ చేశారు.


పాదరక్షలు ధరించి, స్వీట్లు పంపిణీ చేస్తున్న వాసుదేవరెడ్డి

చుడా చైర్మన్ రాజీనామా

జ్ఞానేంద్ర రెడ్డి కూడా..

చిత్తూరు, జూన్ 15: చుడా చైర్మన్ పదవికి కట్టమంచి పురుషోత్తంరెడ్డి రాజీనామా చేశారు. గతంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పనిచేసిన ఆయనకు వైపీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చుడా చైర్మన్ పదవిని కట్టబెట్టారు. పదవీకాలం ముగియడంతో మరో రెండేళ్లు పొడిగించారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో మూడు రోజుల క్రితం తన పదవికి రాజీనామా చేశారు. అలాగే ఎన్ఆర్ఐ అఫైర్స్ ప్రభుత్వ సలహాదారు పోస్టుకు జ్ఞానేంద్రరెడ్డి రాజీనామా చేశారు.

18న స్పందన స్థానే గ్రీవెన్స్‌డే

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 15: ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే స్పందన కార్యక్రమం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' పేరుతో ఇకముందు కొనసాగనుంది. ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ ప్రక్రియ మరింత పటిష్ఠంగా జరుగుతుందని కలెక్టర్ షన్మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సోమవారం బక్రీద్ పండుగ ఉండడంతో మంగళవారం కలెక్టరేట్ నూతన సమావేశ మందిరంలో గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తేదీ మార్పును గుర్తించి వినతిపత్రాలతో మంగళవారం రావాలని కోరారు.

రాజనాల బండలో ప్రమాణం అనగానే..

చోరీకి గురైన నగలు లభ్యం


దొరికిన నగలు

చౌడేపల్లె, జూన్15: సత్య ప్రమాణాలకు నిలయమైన రాజలనాలబండలో సత్య ప్రమాణం అనగానే చోరీకి గురైన నగలు ప్రత్యక్షమయ్యాయి. బాధితుల కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం శ్రీనివాసపురం పందివారిపల్లెకు చెందిన నారమ్మ వ్యవసాయ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తోంది. బీరువాలో ఉంచిన రూ.లక్ష విలువ చేసే తాళిబొట్టు చైను, కమ్మలు 15 రోజుల క్రితం కనిపించకుండా పోయాయి. చుట్టుపక్కల వారిని విచారించినా, గ్రామ పెద్దలు పంచాయతీ పెట్టినా లాభం లేకపోయింది. పెద్ద మనుషుల సూచనతో రాజలనాలబండలో సత్య ప్రమాణం చేయటానికి అనుమతి తీసుకుని గ్రామస్తులను రావాలని కోరింది. ఈ క్రమంలో శనివారం నిద్ర లేవగానే నగల మూట ఆమె ఇంటి ముందు ప్రత్యక్షమైంది. సంతోషించిన నారమ్మ రాజనాలబండకు చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించింది.

మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందికి జరిమానా

చిత్తూరు, జూన్ 15: మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందికి రూ.10వేలు చొప్పున రూ.1.80లక్షలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. రెండు రోజుల క్రితం నగరంలో చేపట్టిన వాహనాల తనిఖీలో మద్యంతాగి వాహనాలు నడిపిన 18మందిని గుర్తించి శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి వెన్నల ముందు ప్రవేశపెట్టారు. ఆమె ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు మాట్లాడుతూ ఏడు నెలల వ్యవధిలో 223 మందికి రూ.16లక్షలు జరిమానా విధించినట్లు చెప్పారు.

లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి


మృతి చెందిన అబ్దుల్ రౌఫ్, ప్రమాదానికి కారణమైన లారీ

వి.కోట, జూన్ 15: కుప్పం - వి.కోట ప్రధాన రహదారిలో దాసార్లపల్లె వద్ద ద్విచక్ర వాహనాన్ని సిలిండర్లు తరలిస్తున్న లారీ ఢీకొనడంతో రామకుప్పంకు చెందిన అబ్దుల్‌రౌఫ్ మృతి చెందాడు. శనివారం ఉదయం 10.30 గంటలకు కుప్పం వైపు నుంచి గ్యాస్ సిలిండర్ల లోడ్డుతో వెళుతున్న లారీ అదుపు తప్పి ముందు వెళుతున్న అబ్దుల్‌రౌఫ్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో అతని తలపగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన వాహనాన్ని సీజ్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సీఐ లింగప్ప కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

15 మందిపై అట్రాసిటీ కేసు

వెదురుకుప్పం, జూన్ 15: 15 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు కార్వేటినగరం సీఐ సత్యబాబు శనివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వెదురుకుప్పం మండలం బొమ్మనదొడ్ల కాలనీలో పక్క గ్రామం కోణంగిపల్లెలోని అగ్రవర్ణాల వారు వచ్చి మద్యం తాగారు. దీనిపై ఇరు గ్రామాల వారు ఘర్షణపడ్డారు. ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. తమను కులం పేరుతో దూషించి, దాడులకు పాల్పడ్డారని బొమ్మనదొడ్ల కాలనీకి చెందిన వారు ఫిర్యాదు చేయడంతో కోణంగిపల్లెకు చెందిన రుక్మాంగధర్‌తో సహా మరో 14 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ రవాణా

తమిళనాడుకు తరలిపోతున్నా పట్టించుకోని అధికారులు


జగన్నాథపురం రోడ్డు - లక్ష్మీరాజుపేట గ్రామ పంచాయతీలో ఆక్రమణకు గురైన గుట్టలు

కార్వేటినగరం, జూన్ 14: మండలం నుంచి తమిళనాడుకు గ్రావెల్ అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. లక్ష్మీరాజుపేట గ్రామ పంచాయతీ దీనికి కేంద్ర బిందువుగా మారింది. ఈ ప్రాంతం తమిళనాడు రాష్ట్రం పళ్లిపట్టు తాలూకా కేంద్రాన్ని అనుకుని ఉండడం అక్రమార్కులకు కలిసి వస్తోంది. లక్ష్మీరాజుపేట నుంచి జగన్నాథపురం, తమిళనాడుకు చెందిన పుదుపట్టు మార్గంలో టిప్పర్ల ద్వారా రవాణా సాగిస్తున్నారు. జగన్నాథపురం రోడ్డు పక్కనున్న గుట్టల్లో ఇప్పటికే 50 శాతానికి పైగా మట్టిని తరలించేశారు. గడిచిన ఐదేళ్లలో ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించడంతో ఈ వ్యాపారం మూడు పువ్వులు..ఆరు కాయలుగా నడిచింది. మండలంలో ఏ ఒక్క గుట్టనూ అక్రమార్కులు వదల్లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. తాజాగా ప్రభుత్వం మారడంతో జగన్నాథపురం గ్రామస్తులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సోదరుడు నిధి దృష్టికి తీసుకురావడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తిరుపత్తూరులో చిరుత..

కుప్పంలో కలకలం!


తిరుపత్తూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో చిరుత (ఫైల్ ఫొటో)

కుప్పం, జూన్ 15: తమిళనాడులో చిరుత హల్‌చల్ చేస్తే కుప్పంలో కలకలం రేగింది. అక్కడ పట్టిన చిరుతను కుప్పం నియోజకవర్గంలోని అటవీ ప్రాంతంలో వదిలివేశారని వదంతులు రేగడంతో అటవీ సమీప గ్రామాల ప్రజలు భయభ్రాంతులవుతున్నారు. అయితే ఈ విషయాన్ని అధికారులు ధ్రువీకరించడం లేదు. కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలం సరిహద్దుల నుంచి సుమారు 10-15 కిలోమీటర్ల దూరంలో తమిళనాడు రాష్ట్రం ఉంటుంది. జిల్లా కేంద్రమైన తిరుపత్తూరు గ్రామాల్లో శుక్రవారం చిరుత సంచారం కనిపించింది. ఇళ్ల మధ్య తిరుగుతూ హల్‌చల్ చేసిన ఈ చిరుతను చూసి అక్కడి ప్రజానీకం భయాందోళనకు గురైంది. తిరుపత్తూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో దూరిన చిరుత, రోగులను ఆందోళనకు గురిచేసింది. స్పందించిన తమిళనాడు అటవీ శాఖాధికారులు దాన్ని బంధించి తీసుకెళ్లారు. అక్కడితో ఆ హడావుడి సద్దుమణిగింది. అయితే బంధించిన చిరుతను ఒక వాహనంలో తీసుకొచ్చి, ఎక్కడో అటవీ ప్రాంతంలో వదిలేస్తున్న దృశ్యాలు శనివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. తమిళనాడు నుంచి చిరుతను తీసుకొచ్చి ఆంధ్రా-తమిళనాడు సరిహద్దులోని కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం ననియాల తాండా అటవీ ప్రాంతంలో వదిలేసినట్లు వదంతులు అదే సోషల్ మీడియాలో ప్రచారమయ్యాయి. దీంతో శనివారం ఉదయం నుంచి కుప్పం సమీప అటవీ సరిహద్దు గ్రామాల ప్రజానీకం తీవ్ర ఆందోళనకు గురవుతోంది. నిజంగానే ఎప్పుడు ఏ క్షణంలో ఏం జరుగుతుందో, ఎప్పుడు ఏ వైపు నుంచి చిరుత వచ్చి మీద పడుతుందోనన్న భయంతో గడుపుతున్నారు. ఈ ప్రచారాన్ని స్థానిక అటవీ శాఖాధికారులు నిర్ధారించడం లేదు. ఆ విషయంలో తమకు స్పష్టమైన సమాచారం లేదని చెబుతున్నారు.

తిరుమల ఘాట్‌లో అదుపుతప్పిన కారు

తిరుమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్‌లో శనివారం ఓ కారు అదుతప్పింది. అదృష్టవశాత్తూ అందులోని భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. హైదరాబాదుకు చెందిన ఓ కుటుంబం శ్రీవారి దర్శనం పూర్తిచేసుకుని శనివారం మధ్యాహ్నం తమ కారులో తిరుగు ప్రయాణమైంది. అలిపిరి టోల్‌గేట్‌కు సమీపంలో వాహనం అదుపుతప్పి కుడివైపున్న చిన్నపాటి గట్టును ఢీకొంది. ఆపై రోడ్డుపక్కకు దూసుకెళ్లి, ముందున్న ఓ బండరాయిని ఢీకొని ఆగిపోయింది. వాహనంలోని నలుగురు భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

శ్రీవారి హుండీ ఆదాయంరూ.3.71 కోట్లు

తిరుమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 66,782 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 36,229 మంది తలనీలాలు సమర్పించారు.

పారితోషికం ఎప్పుడిస్తారో?

పనులు చేయించుకుని సాకులు చెబుతున్నారు

ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగుల ఆవేదన

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 15: 'ఎన్నికల్లో గొడ్డుచాకిరీ చేశాం.. పోలింగ్ ముగిసి... ఫలితాలు వెలువడి 12 రోజులవుతున్నా టీఏ, డీఏ పారితోషికం బిల్లులు ఇవ్వకుండా అధికారులు సతాయిస్తున్నారు.. ఇస్తారో చేతులెత్తేస్తారో తెలియడం లేదు' అని ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇవ్వాల్సిన పైకం రూ.కోటికి మించి ఉన్నట్లు సమాచారం. దాదాపు 600 మంది ఉద్యోగులు ఎన్నికల షెడ్యూల్ వచ్చింది మొదలు కౌంటింగ్ ముగిసే వరకు సేవలు అందించారు. పోలింగ్ నాడు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పీవో, ఏపీవో, ఓపీవోలకు అదేరోజు రాత్రి పారితోషికం ఇచ్చారు. కానీ మిగిలిన 600 మంది ఉద్యోగులకు కేడర్లవారీగా రూ.300 నుంచి రూ.600 వరకు చెల్లించాల్సి ఉంది. ఇంతవరకు బిల్లులు విడుదల కాకపోవడం పట్ల ఉద్యోగులు గుసగుసలాడుతున్నారు.

వచ్చే వారం చెల్లిస్తాం

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన ఉద్యోగులందరికీ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పారితోషికాలు వచ్చే వారం చెల్లిస్తాం. ఇప్పటికే అన్ని విభాగాల నుంచి బిల్లులు తెప్పించాం. 600 మంది ఉద్యోగులకు రూ.కోటికి పైగానే చెల్లించాల్సి ఉంది. - డీఆర్వో పుల్లయ్య

బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలి


అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 15: బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య అన్నారు. శనివారం ఉదయం తన చాంబర్‌లో విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 6-14 సంవత్సరాల్లోపు పిల్లలందరూ ప్రభుత్వ బడిలోనే చదువుకోవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు సమన్వయం చేసుకుని ఇంటింటికీ వెళ్లి పిల్లలు పాఠశాలలకు వెళ్తున్నారో లేదో గుర్తించి, చేర్పించాలని ఆదేశించారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన కమిటీలు ఈనెల 13 నుంచి జూలై 12వ తేదీ వరకు ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని సూచించారు. డీఈవో దేవరాజులు, ఎస్ఎస్ఏ పీవో వెంకట్రమణారెడ్డి, డీపీవో లక్ష్మి పాల్గొన్నారు.

టీటీడీ ఈవోగా శ్యామలరావు బాధ్యతల స్వీకారం నేడు

తిరుమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవోగా శ్యామలరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న ఆయన్ను టీటీడీ ఈవోగా నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఆయన ఆదివారం ఉదయం తిరుమలకు చేరుకుని శ్రీవారి ఆలయంలోకి వెళ్లనున్నారు. అక్కడ జేఈవో వీరబ్రహ్మం నుంచి ఈవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు. అనంతరం వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్టు సమాచారం.

అనధికార తట్టలకు బ్రేక్

తిరుమల కొండపై మొదలైన ప్రక్షాళన


వరాహస్వామి విశ్రాంతి గృహం వద్ద అనధికార తట్టలను మూసివేయిస్తున్న అధికారులు

తిరుమల, జూన్15(ఆంధ్రజ్యోతి): తిరుమల నుంచే ప్రక్షాళన మొదలవుతుందని ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చంద్రబాబు ప్రకటించడంతో టీటీడీ అధికార యంత్రాంగంలో చురుకు మొదలైంది. తిరుమలలో ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయిన అనధికార తట్టల (చిన్న షాపులు)ను తొలగించే పని ప్రారంభమైంది. విజిలెన్స్, హెల్త్, రెవిన్యూ విభాగాల టాస్క్‌ఫోర్ బృందం శనివారం తిరుమలలో పలు చోట్ల ఆకస్మిక దాడులు చేసింది. వెంగమాంబ నిత్యాన్నప్రసాద భవనం వద్దనున్న అనధికార తట్టలను మూసివేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపారాలు చేస్తే ఇకపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇకముందు కూడా దాడులు కొనసాగుతాయని కాలం చెల్లిన లైసెన్సులతో వ్యాపారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చంద్రబాబు తిరుమలకు వచ్చినపుడు ఆక్రమణలు, అనధికార తట్టల గురించి స్థానిక టీడీపీ కార్యకర్తలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే తిరుమలలో ప్రక్షాళన మొదలైనట్టు తెలుస్తోంది.

పుట్టగొడుగుల్లా తట్టలు

నిబంధనల ప్రకారం టీటీడీ నుంచి లైసెన్సులు ఉండేవారే తిరుమలలో వ్యాపారాలు చేసుకోవాలి.అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తట్టలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా తట్టలు పెట్టి వ్యాపారాలు మొదలుపెట్టారు. అధికారికంగా లైసెన్సులు పొందినవారి జీవనాన్ని దెబ్బకొట్టేలా అడ్డదిడ్డంగా తట్టలు పెట్టి వ్యాపారాలు చేస్తూ హల్‌చల్ చేశారు. వీరిని టీటీడీ అధికారులు కూడా నియంత్రించలేకపోయారు. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం నుంచి బయటకు వచ్చే ప్రదేశంలో, వరాహస్వామి విశ్రాంతి గృహం ముందు, షాపింగ్‌కాంప్లెక్స్ వద్ద డీఎంబీ రోడ్డు వంటి ప్రాంతాల్లో తట్టలు భారీగా పెరిగిపోయాయి. వ్యాపారం బాగా జరిగే కొన్ని ప్రాంతాల్లో తట్ట నడుపుకునేవారు దాని యజమానికి రోజుకు రూ.వెయ్యి కూడా చెల్లిస్తుంటారు. ఇంత ఆదాయం వచ్చే మార్గం కావడంతో నాయకులంతా తట్టల మీద పడ్డారు.ఐదేళ్ల వైసీపీ వారు తట్టలు నడుపుకున్నారు.రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఇప్పుడిప్పుడే టీడీపీ వారు కూడా అనధికార తట్టలు పెట్టిస్తున్నారు. హోటళ్ల తరహాలో సాగుతున్న ఈ వ్యాపారాలు నిజమైన అనుమతులున్నవారి వ్యాపారాలను దెబ్బతీస్తుండడంతో వారు లబోదిబోమంటున్నారు.

డిగ్రీ 2, 4 సెమిస్టర్ పరీక్షలు వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 15: ఎస్వీయూనివర్సిటీ పరిధిలో ఈనెల 12వ తేదీన నిర్వహించాల్సిన డిగ్రీ 2, 4వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. అదే రోజు యూజీసీ నెట్ పరీక్షలు నిర్వహించనున్న కారణంగా ఈ పరీక్షలు వాయిదా పడ్డాయి. వాయిదా పడిన పరీక్షలు ఈనెల 18వ తేదీ నిర్వహించనున్నట్టు వర్సిటీ పరీక్షల అధికారి దామ్లా నాయక్ వెల్లడించారు.

11 మంది డీబార్

డిగ్రీ 2, 4 వ సెమిస్టర్ పరీక్షల్లో 11 మంది విద్యార్థులు డీబార్ అయ్యారు. శనివారం పలు కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షలను హైపవర్ కమిటీ పర్యవేక్షించింది. ఈ సమయంలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న 11 మంది విద్యార్థులను గుర్తించి డీబార్ చేశారు. తిరుపతి, చిత్తూరుల్లో నలుగురు చొప్పున, మదనపల్లెలో ముగ్గురిని డీబార్ చేసినట్టు దామ్లానాయక్ తెలిపారు.

ముగిసిన తిరుపతి సిరి సంత

తిరుపతి (కల్చరల్), జూన్ 15: నాబార్డు సహకారంతో కనెక్ట్ టూ ఫార్మర్ సంస్థ మూడ్రోజులుగా మహతి కళాక్షేత్రం వేదికగా నిర్వహించిన తరంగ్ (తిరుపతి సిరి సంత) కార్యక్రమం శనివారం ముగిసింది. రైతులు, చేనేత కార్మికులు తమ ఉత్పత్తులను సుమారు 40 స్టాల్స్‌లో ప్రదర్శించారు.


సినీ నటులు సాయిధరమ్ తేజ్, ప్రగ్యా జైస్వాల్ శనివారం తిరుమల వెంకన్నను దర్శించుకున్నారు.

భోగశ్రీనివాసమూర్తికి నేడు ప్రత్యేక సహస్ర కలశాభిషేకం

తిరుమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలోని భోగ శ్రీనివాస మూర్తికి ఆదివారం ప్రత్యేక సహస్ర కలశాభిషేకం జరగనుంది. 18 ఏళ్లుగా శ్రీవారి ఆలయంలో టీటీడీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఉదయం ఆరు నుంచి 8.30 గంటల వరకు శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద భోగశ్రీనివాసమూర్తికి అర్చకస్వాములు ఏకాంతంగా సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తారు.

రుయాలో 'ఫోర్జరీ'లు ఆగవా?

నా సంతకం ఫోర్జరీ చేశారంటూ డీఎంఈకి సీఎస్ఆర్ఎంవో ఫిర్యాదు

తిరుపతి(వైద్యం), జూన్ 15: రుయాస్పత్రిలో అధికారుల సంతకాలు ఫోర్జరీ చేయడం ఆగడం లేదు. గతంలో మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ సర్టిఫికెట్ కోసం కొందరు సిబ్బంది ఏకంగా సూపరింటెండెంట్ సంతకాన్నే ఫోర్జరీ చేసిన విషయం తెలిసిందే. అలాగే ఆరోగ్యశ్రీలో కొందరు డేటా ఎంట్రీ ఆపరేటర్లు అయితే వైద్యాధికారులు సంతకాలు ఫోర్జరీ చేసి ఆస్పత్రిలో వైద్యం పొందని రోగుల పేరుతో రూ.లక్షలు స్వాహా చేసిన విషయం వెలుగులోకి రావడం విదితమే. తాజాగా సీఎస్ఆర్ఎంవో తన సంతకాన్ని కొందరు అధికారుల సాయంతో పారిశుధ్య ఏజన్సీలో పనిచేసే వ్యక్తి ఫోర్జరీ చేసి నాలుగు నెలల బిల్లులను మంజూరు చేసుకున్నారని డీఎంఈకి లక్ష్మా నాయక్ ఫిర్యాదు చేశారు. రుయాస్పత్రిలో ఏజన్సీ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న ఏ-1 సర్వీస్‌కు నెలకు రూ.50లక్షలకుపైగా బిల్లులు మంజూరు చేస్తారు. రోజూ పారిశుధ్య ఏజన్సీ పనితీరును పరిశీలించి.. నెలాఖరులో అడ్మిన్, హెల్త్ సూపర్‌వైజర్, సీఎస్ఆర్ఎంవోలు మార్కులు వేస్తారు. ఈ మార్కుల ఆధారంగానే బిల్లులు చెల్లిస్తారు. ఈ క్రమంలోనే గత ఏడాది మార్చి నుంచి జూన్ వరకు ఏజన్సీ పనితీరు బాగాలేదని, దానికి సంబంధించి బిల్లులు కొంత కాలం పెండింగ్‌లో పెట్టారు. దాంతో ఆ ఏజన్సీలో పనిచేసే మేనేజరు రాజేష్ అనే వ్యక్తి ఈ నాలుగు నెలలకు సంబంధించి తన సంతకాన్ని ఫోర్జరీ చేసి బిల్లులు మంజూరు చేయించుకున్నాడని లక్ష్మానాయక్ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనివెనుక రుయాస్పత్రిలోని కొందరు అధికారుల ప్రమేయం కూడా ఉందన్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఈ అంశంపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు వివరించారు. పైగా ఈ విషయంపై రుయా అధికారులను ప్రశ్నిస్తే.. తప్పుడు ఆరోపణలతో తనను సరెండర్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారిస్తే నిజానిజాలు వెలుగులోకి వస్తాయన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

అమర్ గెలుపుతో తిరుమలకు పాదయాత్ర



పాదయాత్ర ప్రారంభించిన జీడిమాకులపల్లి గ్రామస్తులు

పలమనేరు, జూన్ 15: గంగవరం మండలంలోని జీడిమాకులపల్లెకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. అమరనాథరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో పాటు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే తిరుమలకు పాదయాత్ర చేస్తామని టీడీపీ కార్యకర్తలు మొక్కుకున్నారు. కోరిక తీరడంతో శనివారం పాదయాత్రగా బయలు దేరారు. పలమ నేరులోని వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి పూజలు చేసి కాలినడకన తిరుమలకు బయలు దేరారు. గ్రామానికి చెందిన రామచంద్ర, మురళి, సురేంద్రబాబు, కృష్ణప్ప, ఈశ్వర్, పవన్‌కుమార్, లతీష్‌కుమార్, శ్రీను, దేవేంద్ర తదితరులు పాదయాత్రగా వెళ్లారు.

తిరుమల యాత్రికులకు శీతలపానీయాల పంపిణీ

పలమనేరు మీదుగా జాతీయరహదారిపై పాదయాత్రగా తిరుమలకు వెళ్తున్న భక్తులకు పలమనేరుకు చెందిన సామాజిక కార్యకర్త మధుసూదర్‌రావు శీతలపానీయాలు పంపిణీ చేశారు.

సింహ వాహనంపై వేణుగోపాలుడి విహారం



గుడుపల్లె, జూన్ 15: శెట్టిపల్లెలోని వేణుగోపాలుడు సింహ వాహనంపై శనివారం వైభవంగా ఊరేగారు. మండలంలోని శెట్టిపల్లె వేణుగోపాలస్వామి ఆలయం వార్షిక ఉత్సవాలలో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి విశేష అభిషేకాలు, పూజలు చేశారు. వివిధ పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వేణుగోపాలుడి ఉత్సవర్లను పట్టువస్త్రాలు, ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి సింహ వాహనంపై ఆశీనుల్ని చేసి మంగళ వాయిద్యాలతో గ్రామ వీధుల్లో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి కర్పూర హారతులు సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.

అప్పుల బాధలు తాళలేక మహిళ మృతి



మృతిచెందిన సుమిత్ర

పుంగనూరు రూరల్, జూన్15: అప్పులు తీర్చలేక అప్పు ఇచ్చిన వారి వేధింపులు తాళలేక ఓ మహిళ పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి పుంగనూరులో జరిగింది. కుటుంబసభ్యుల కథనం మేరకు.. తూర్పు మొగసాలకు చెందిన సుందరరాజు, భార్య సుమిత్ర (35) కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవారు. ఇటీవల ఇంటి ఖర్చులు, కుమార్తె వివాహం కోసం అప్పులు చేశారు. అప్పుల వారి వేధింపులు అధికం కావడంతో సుమిత్ర పురుగులమందు తాగి స్పృహ కోల్పోయింది. గుర్తించిన కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

బక్రీద్‌కు ఏర్పాట్లు ముమ్మరం



పుంగనూరు రూర ల్, జూన్15: బక్రీద్ సందర్భంగా ఎన్ఎస్‌పేటలోని ఈద్గా వద్ద మున్సిపల్ కార్మికులు శుభ్రం చేసే పనులను ముమ్మరం చేశారు. శనివారం మున్సిపల్ డీఈ మహేశ్, ఏఈ కృష్ణకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్యలు పనులను చేయించారు. టీడీపీ మైనార్టీ నాయకులు సుహేల్‌బాషా, సద్దాం హుస్సేన్, నూరుబాషాలు పనులను పర్యవేక్షించారు.

19న కాణిపాక ఆలయ హుండీ లెక్కింపు

ఐరాల(కాణిపాకం), జూన్ 15: ఈ నెల 19న వరసిద్ధుడి ఆలయ హుండీని లెక్కించనున్నట్లు ఈవో వెంకటేశు తెలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో స్వామి కానుకలను లెక్కించను ఆయన పేర్కొన్నారు. లెక్కింపు సందర్భంగా ఆలయ ఉద్యోగులు, సిబ్బంది ఎవ్వరు సెలవు పెట్టరాదన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



సురేష్‌బాబు (ఫైల్ ఫొటో)

నింద్ర, జూన్ 15: గుండెపోటుతో గణిత ఉపాధ్యాయులు సురేష్ బాబు(52) మృతి చెందారు. ఆయన నింద్రలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. శనివారం విధులకు హాజరై విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తూ గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు. విద్యార్థులు కేకలు వేయడంతో ఉపాధ్యాయులు వెంటనే నింద్రలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యసేవలు అందిస్తుండగా మృతి చెందారు. ఆయన మృతికి ఎంఈఓ లు, ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

డైట్‌లో సరిఫికెట్ల పరిశీలన



కార్వేటినగరం, జూన్ 15: కార్వేటినగరం ప్రభుత్వ డైట్‌లో డీఎడ్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను శనివారం పరిశీలించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మండలాల నుంచి ఎంపికైన అభ్యర్థులు దూర ప్రాంతాల నుంచి వచ్చారు. కార్వేటినగరం పోలీస్ స్టేషన్ నుంచి డైట్‌కు వెళ్లడానికి కిలోమీటర్ దూరం. అభ్యర్థులు సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డారు. కొంతమంది చంటిపిల్లలతో వచ్చి మరింత ఇబ్బంది పడ్డారు. చెంగల్‌రాజు ఆధ్వర్యంలో ఈ సర్టిఫికేట్ల పరిశీలన కార్యక్రమం జరిగింది.

రేపు జంతుబలుల నిషేధం: కలెక్టర్

చిత్తూరు కల్చరల్, జూన్ 15: బక్రీద్‌ను సోమవారం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రభుత్వ ఖాజీ కమాలుల్లా జుహారి జునైది శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దానాలు చేసి అల్లా ఆశీస్సులు పొందాలని కోరారు. ఆ రోజు నగరంలోని జంతుబలుల నిషేధం ఉందని కలెక్టర్ షన్మోహన్ స్పష్టం చేశారు. శనివారం ఆయన అధికారులతో, ముస్లిం మత పెద్దలతో సమీక్ష నిర్వహించారు. కాగా నగరంలోని రెడ్డిగుంట, మురకంబట్టు తదితర ప్రాంతాల్లో పొట్టేలు, మేక పోతుల వ్యాపారాలు అధికంగా జరిగాయి.

మృతిచెందిన విద్యార్థులకు నివాళులు

బంగారుపాళ్యం, జూన్ 15: తిరుపతి-బెంగళూరు జాతీయ రహదారిలోని చెర్లోపల్లి వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పవన్‌కల్యాణ్, మంజు, చరణ్‌తేజ్‌లకు శనివారం మహాసముద్రం గ్రామంలో ఒకే చోట అంత్యక్రియలు నిర్వహించారు. ఈ గ్రామానికి చెందిన వీరు ముగ్గురూ స్నేహితులు. విద్యార్థుల మృతదేహాలను చూసి స్నేహితులు, గ్రామస్థులు విలపించారు. ఎమ్మెల్యే మురళీ మోహన్, క్లస్టర్ ఇన్‌చార్జి ధరణీనాయుడు, నాయకులు జనార్దన్ గౌడ్, కుప్పాలమురళి మహేంద్ర, పెరుమాళ్, సూరి, జయరామ్‌రెడ్డి తదితరులు మృతదేహాలకు నివాళులర్పించారు.

పెద్దిరెడ్డి పర్యటనను అడ్డుకోవడం వైసీపీ సంస్కృతే : బీజేపీ

పుంగనూరు, జూన్15: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు పర్యటన అడ్డుకోవడం వైసీపీ సంస్కృతే అని బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకుడు అయూబ్ ఖాన్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు పుంగనూరు, కుప్పంలో పర్యటించకుండా అడ్డుకున్న వైసీపీ నాయకులకు బుద్ధి చెప్పడానికే టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దిరెడ్డి పర్యటనను అడ్డుకున్నట్లు వివరించారు. వైసీపీ నాయకుల అరాచకాలు, అక్రమాలు ప్రజలకు తెలియజేయడానికే టీడీపీ శ్రేణులు ఇలా నిరసన తెలియజేశారని పేర్కొన్నారు.

ప్రతిపక్షాలపై దాడులు శోచనీయం

పుంగనూరు రూరల్, జూన్15: ప్రతిపక్షాల నాయకులపై అధికార పార్టీ నాయకులు దాడులు చేయడం శోచనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి టి.జనార్ధన్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేయరాదన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సోమల ఏఎంసీ చైర్ పర్సన్ రాజీనామా



సోమల, జూన్ 15: సోమల ఏఎంసీ చైర్ పర్సన్ అరుణ తన పదవికి రాజీనామా చేశారు. ఈమేరకు రాజీనామా పత్రాన్ని శనివారం మార్కెట్ కమిటీ కార్యదర్శి సరళాదేవికి అందజేశారు. వైసీపీ ప్రభుత్వంలో రెండు పర్యాయాలు ఆమె చైర్ పర్సన్‌గా పనిచేశారు. అలాగే పలువురు డైరెక్టర్లు తమ పదవులకు రాజీనామా చేశారు.

టీడీపీ నాయకుడికి మాతృవియోగం



మంగమ్మ (ఫైల్‌ఫొటో)

పెద్దపంజాణి, జూన్ 15: టీడీపీ సీనియర్ నాయకుడు గోపాల్‌రాజు తల్లి మంగమ్మ (106) శనివారం మృతి చెందారు. మండలంలోని మంగప్పల్లెలోని స్వగృహంలో ఆమె మృతిచెందారు. పలమనేరు, పుంగనూరు నియోజక వర్గాలలోని టీడీపీ నాయకులు ఆమె మృతికి సంతాపం ప్రకటించారు. ఆదివారం మృతురాలి స్వగ్రామంలో అంత్య క్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

శిలాఫలకాలు ధ్వంసం చేశారని పోలీసులకు ఫిర్యాదు

బైరెడ్డిపల్లె, జూన్ 15: మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు సంబంధించిన శిలా ఫలకాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని వైసీపీ నాయకులు ఎంపీపీ రెడ్డెప్ప, జడ్పీటీసీ కేశవులు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం ఎస్ఐ కృష్ణయ్యకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి శిలా ఫలకాలను ధ్వంసంచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పిల్లలను పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవు

సోమల, జూన్ 15: బడి ఈడు పిల్లలు పనుల్లో కఠిన చర్యలు తప్పవని పీలేరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆనందబాబు హెచ్చరించారు. శనివారం బాల కార్మికుల నిర్మూలన వారోత్సవాల్లో భాగం పలుహోటళ్లు, పెట్రోల్ బంకులు, మెకానిక్ షాపుల్లో తనిఖీలు చేశారు. పిల్లలను పనుల్లో పెట్టుకోరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శివరత్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హరిత, మహిళా పోలీసు ప్రసూన, ఉమాదేవి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సోమల పంచాయతీకి రూ. 4.66 లక్షల ఆదాయం

సోమల, జూన్ 15: సోమల వారపు సంత వేలంలో రూ. 4.66 లక్షలు పలికింది. ఎంపీడీవో నారాయణ ఆధ్వర్యంలో స్థానిక సచివాలయంలో జరిగిన వేలం పాటల్లో పలువురు పోటీ పడ్డారు. గత ఏడాది రూ. 5.32 లక్షలు ఆదాయం రాగా ఈఏడాది ఆదాయం తగ్గింది. కాగా బస్టాండ్ గేట్‌కు వేలం పాటలు వాయిదా వేశారు.

రక్తికట్టించిన భీష్మ, పరశురాముల సంగ్రామం

కల్లూరు, జూన్ 15: పులిచెర్ల మండల కేంద్రంలోని మహాభారత యజ్ఞం ప్రాంగణంలో శనివారం భాగవతారిణి భారతి వినిపించిన భీష్మ పరశురాముడి సంగ్రామం హరికథ ఆకట్టుకుంది. మహాభారత యజ్ఞం మూడవరోజు హరికథలో భాగంగా ముందుగా ద్రౌపది ధర్మరాజుల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భీష్మ పరశురాముడి హరికథను భాగవతారిణి భారతి వినిపించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.

కుప్పంలో ప్రక్షాళన ప్రారంభం

- రెస్కోలో అక్రమాలపై కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ విచారణ
- అధికార యంత్రాంగంలో గుబులు



కుప్పంలోని రెస్కో ప్రధాన కార్యాలయం

కుప్పం, జూన్ 15: ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గంలో ప్రక్షాళన ప్రారంభమైంది. రెస్కో (కుప్పం గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ)లో జరిగిన అక్రమ నియామకాలపై కో-ఆపరేటివ్ డిపార్టుమెంట్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కుమార్ ఆనందన్ విచారణతో ఇది మొదలైంది. దీంతో వైసీపీ పాలనలో నాయకుల అండ చూసుకుని చెలరేగిపోయిన వివిధ ప్రభుత్వ కార్యాలయాల అధికారులు, ఉద్యోగ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది.

టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ ప్రభుత్వంలో కుప్పంలోని పలు ప్రభుత్వ సంస్థల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ గతంలో చాలా సార్లు పదేపదే హెచ్చరించారు. టీడీపీ ఘన విజయం సాధించిన తర్వాత సైతం ఇదే అంశాన్ని ఆయన పునరు ద్ఘాటించారు. అంతేకాదు కుప్పం రెస్కోలో, మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై ప్రత్యేకించి ప్రస్తావించడమే కాకుండా త్వరలోనే సీబీసీఐడీచే రెస్కో అక్రమాలపై విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. ఇదే క్రమంలో రెస్కోలో విచారణ ప్రారంభమైంది. అయితే సీబీసీఐడీ కాకుండా కో-ఆపరేటివ్ డిపార్టుమెంటు ద్వారానే ఈ విచారణ జరుగుతోంది.

● అసిస్టెంట్ రిజిస్ట్రార్ విచారణ

రెస్కోలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమ నియామకాలు జోరందుకున్నాయన్న ప్రచారం విస్తృతంగా జరిగింది. అర్హత లేని చాలామంది అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారని, పదోన్నతులు కల్పించారని టీడీపీ పదేపదే ఆరోపిస్తూ వచ్చింది. ఈ క్రమంలో శాంతిపురం మండలం తుమ్మిశి రోడ్డు దొంకుమానుపల్లె గ్రామానికి చెందిన నగేశ్, రెస్కోలో జరిగిన అవకతవకలపై కో-ఆపరేటివ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అందులో ప్రధానంగా ఆయన రెస్కో మాజీ ఎండీ సుబ్రమణ్యంపై రెండు ఫిర్యాదులు చేశారు. రెస్కోలో సుబ్రమణ్యం ఎండీగా ఉన్న సమయంలో ఆరుగురు సభ్యుల కారుణ్య నియామకాలతో పాటు, 19 మంది ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కూడా సహకార చట్టాలు, నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై విచారణ జరపాలని కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్, పలమనేరు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కుమార్ ఆనందన్‌ను ఆదేశించారు. ఆయన 14వ తేదీన రెస్కోలో విచారణ జరిపారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. అయితే ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎండీ సుబ్రమణ్యం మాత్రం విచారణకు హాజరు కాలేదు. దీనిపై విచారణాధికారులు సీరియస్‌గా ఉన్నారు.

● సర్వీస్ రిజిస్టర్ మాయంతోటే మొదలు

నిజానికి వైసీపీ ప్రభుత్వం మారి, టీడీపీ అధికారంలోకి రాగానే రెస్కో అధికార యంత్రాంగంలో గుబులు మొదలైంది. రెస్కో చైర్మన్ సెంథిల్, సభ్యులు రాజీనామాలు చేసి తప్పుకున్నాక అధికారులే పూర్తిగా బాధ్యులుగా మారాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈనెల మొదటి వారం చివరలో ఉద్యోగుల సర్వీసు రిజిస్టర్ ఉన్నట్టుండి మాయమైంది. దీనిపై రెస్కో ప్రస్తుత ఎండీ ప్రభాకర్, ఎస్టాబ్లిష్‌మెంట జేఈవో కృష్ణమూర్తిని బాధ్యుడిని చేస్తూ వివరణ ఇవ్వాల్సిందిగా ఆయనకు నోటీసు జారీ చేశారు. సరైన వివరణ లభించకపోవడంతో ఆయనను గుడుపల్లెకు బదిలీ చేశారు. పాత తేదీలతో సంతకాలు చేసి, కొందరు ఉద్యోగుల అక్రమ నియామకాలు, పదోన్నతులను సక్రమం చేయాలన్న దురు ద్దేశంతోనే సర్వీసు రిజిస్టర్ మాయమైందని, వివాదం రచ్చకెక్కాక భయపడి ఆ రిజిస్టర్‌ను వెనక్కు ఇచ్చేశారని చెబుతున్నారు. అంతేకాదు.. అంతకు ముందు ప్రస్తుత ఎండీ ప్రభాకర్‌కు ముందు సీనియారిటీ ఉన్న అధికారులు ఉన్నా సరే వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నిబంధనలను అతిక్రమించి పదోన్నతి కల్పించారని ఉద్యోగులు చెబుతున్నారు. ఈ అక్రమ నియామకాలు, నిబంధనలను అతిక్ర మించి పదోన్నతులకోసం లక్షలు చేతులు మారాయన్న ఆరోపణలు అప్పట్లో వినిపించాయి.

● ఇతర డిపార్టుమెంట్లలో గుబులు

రెస్కోలో అక్రమాలపై విచారణ మొదలు కావడంతో కుప్పం నియోజకవర్గ పరిధిలోని ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, అధికారుల్లో గుబులు మొదలైంది. రెవెన్యూ, మున్సిపాలిటీ వంటి ప్రధాన శాఖల్లో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన పలు అవకవతకలు ప్రస్తుతం చర్చకు వస్తున్నాయి. ప్రధానంగా రెవెన్యూలో కుప్పం మండలంలో గతంలో పనిచేసిన ఒక తహసీల్దారుపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎప్పుడు, ఏ డిపార్టుమెంటపై విచారణాధికారులు పడతారో, ఎవరి ఉద్యోగాలకు ఎసరు వస్తుందో, ఎవరు సస్పెన్షన్లు ఎదుర్కోవాల్సి వస్తుందోనన్న ఆందోళన సర్వత్రా మొదలైంది.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



కల్లూరు, జూన్ 15: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు సీఎం చంద్రబాబు నాయుడు సంతకాలు చేయడం చరిత్రాత్మకమని టీడీపీ రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం కార్యనిర్వాహక కార్యదర్శి ధనంజయ నాయుడు, పుంగనూరు నియోజకవర్గం టీడీపీ మైనారిటీ అధ్యక్షుడు నూర్‌బాషా తెలిపారు. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఐదు సంతకాలు చేయడంపై హర్షిస్తూ పులిచెర్ల మండలం కల్లూరులో శనివారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌దాస్, బారేషావల్లి, అష్రఫ్, పూల రమేష్, ఈఎం రత్నం, అన్వర్‌బాషా, సర్దార్‌బాషా, సయ్యద్‌బాషా, యుగంధర్, నవీన్, కృష్ణమాచ్చారి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ చదువుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ లీలారాణి

పలమనేరు, జూన్15: బడిఈడు పిల్లలతో పాటు బడిమానేసిన పిల్లలందరూ పాఠశాలల్లో ఉండాలని ఇందుకోసం ఉపాధ్యాయులందరూ పని చేయాలని ఎంఈవోలు లీలా రాణి, బాలసుందరం పిలుపునిచ్చారు. శనివారం పలమనేరు ఎమ్మార్సీలో 'నేను బడికి పోతా' కార్యక్రమం అమలుపై ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం జూలై 12 వరకు నిర్వహిస్తామన్నారు. బడిమానేసిన 6నుంచి 14 సంవత్సరాలు లోపు ఉన్న పిల్లలను ఇంటింటి సర్వే ద్వారా గుర్తించి వారందరినీ బడిలో చేర్పించాలన్నారు. ఒడ్డూరు, దిగువకల్లాడు, గంటావూరు, మండీపేట గ్రామాల్లో బడిమానేసిన పిల్లలు ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో ఆ ప్రాంతాలపై ఎక్కువ దృష్టి సారించాలని సూచించారు. బడిలో చేరిన వారు, చేరనివారి వివరాలను సీఆర్పీలు రోజూ ఎంఈవో కార్యాలయానికి పంపాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో విద్యాసాగర్, హెచ్ఎం, జాయింట్ సెక్రటరీలు, సీఆర్పీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సోమలలో మూతపడ్డ ఆర్‌వో ప్లాంట్
నీటికోసం అవస్థలు పడుతున్న జనం



సోమల, జూన్ 15: సోమల స్వయంభేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్ 20 రోజులుగా మూత పడింది. రూ.8.25 లక్షలు వ్యయం చేసి నీటి శుద్ధి యంత్రం ఏర్పాటు చేశారు. కానీ అధికారుల నిర్లక్ష్యంతో పరికరాలు, మోటార్ తరచూ మరమ్మతులకు గురవుతోంది. దీంతో మంచినీరు అందడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఈ క్రమంలోనే పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్ వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఆర్‌వో ప్లాంట్‌ను బాగుచేయాలని కోరుతున్నారు.

ప్రజా పాలన టీడీపీతోనే సాధ్యం



శ్రీవారి మెట్ల వద్ద పూజలు చేస్తున్న టీడీపీ నేతలు

వి.కోట, జూన్ 15: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ప్రజాపాలన మొదలైందని టీడీపీ మండల అధ్యక్షుడు రంగనాథ్ అన్నారు. వి.కోట మండలం తోటకనుమకు చెందిన టీడీపీ శ్రేణులు 50 మంది తిరుమలకు చేపట్టిన పాదయాత్ర శనివారం శ్రీవారి మెట్టు వద్దకు చేరింది. అక్కడ ప్రత్యేక పూజలు చేసి తిరుమలకు కాలినడక కొనసాగించారు. అనంతరం తిరుమలలో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి నేతృత్వంలో నియోజకవర్గం అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు ధీరజ్, నేతలు రామచంద్ర, మురుగేష్, లక్ష్మణ్, విశ్వనాథ్, ఉదయ్‌కుమార్, నవమోహన్, నరేష్, నందకుమార్, బాలసుందరం, అమర్‌జాన్, ఇమ్రాన్, గురప్ప, నారాయణ, శంకరప్ప, వరదప్ప తదితరులు ఉన్నారు.

అన్నక్యాంటీన్ పునఃప్రారంభానికి ఏర్పాట్లు



అన్నక్యాంటీన్ వద్ద శుభ్రం చేయిస్తున్న కమిషనర్

పలమనేరు, జూన్15 : పలమనేరులో మూతపడిన అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబు పేదలకు రూ.5కే అన్నం పెట్టాలన్న ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 200 పైగా అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేశారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని మూసేసింది. దీంతో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన అన్నక్యాంటీన్ భవనాలు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో వాటిని తిరిగి ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో శనివారం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మున్సిపల్ సిబ్బందితో అన్న క్యాంటీన్‌ను శుభ్రం చేయించారు. మరో నెలరోజుల్లోపే అన్న క్యాంటీన్‌ను ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇక్కడి అన్న క్యాంటీన్ ఆనుకొని మురుగునీటి కాలువ ఉంది. ఈ కాలువ నుంచి దుర్గంధం వస్తోంది. అందువల్ల కాలువపై మూత వేయించాలని స్థానికులు కోరుతున్నారు.

వైసీపీ నేతలు దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు రూరల్, జూన్ 15: పుంగనూరులో వైసీపీ నాయకులు తనపై దాడిచేసి గాయపరిచారని, రక్షణ కల్పించాలని టీడీపీ నేత, న్యాయవాది ఎల్.నవీన్ కుమార్‌యాదవ్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడంతో సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ ర్యాలీ చేసినట్లు తెలిపారు. అనంతరం తాను పోలీసు స్టేషన్ సమీపంలో వెళుతుండగా వైసీపీ నేత నల్లబాల వెంకటరెడ్డియాదవ్ తనను దూషించారని పేర్కొన్నారు. ప్రశ్నించినందుకు వెంకటరెడ్డి యాదవ్, అతని అనుచరులు కుమ్మరి వెంకటరమణ, ప్రవీన్, చిన్నప్ప, గడిదేశికి చెందిన బోడేళ్ల వెంకటరెడ్డియాదవ్, నల్లప్పగారి వెంకటరెడ్డియాదవ్‌లు కలసి తనపై దాడి చేశారని తెలిపారు. గతంలోనూ వెంకటరెడ్డియాదవ్ తనపై అనేక తప్పుడు కేసులు పెట్టి వేధించారని, రౌడీషీట్ పెట్టించారని న్యాయం చేయాలని ఎస్పీ, డీఎస్పీ, సీఐలకు ఫిర్యాదు చేశారు.

టీడీపీ నాయకులపై వైసీపీ ఫిర్యాదు

పుంగనూరు రూరల్, జూన్ 15: పుంగనూరులో తన ఇంటిపై రాళ్లతో దాడి చేసి తనను హతమార్చడానికి ప్రయత్నించినట్లు వైసీపీ నేత నల్లబాల వెంకటరెడ్డియాదవ్ శనివారం డీఎస్పీ విష్ణురఘువీర్, సీఐ రాఘవరెడ్డికి ఫిర్యాదు చేశారు. పెద్దగడిదేశికి చెందిన నవీన్‌కుమార్ యాదవ్, ఎల్‌వీ.రమణ, ఉమేశ్‌లు దాడి చేసి ఇంటి అద్దాలను ధ్వంసం చేశారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, వైసీపీ నాయకులు నాగభూషణం, చంద్రారెడ్డియాదవ్ పాల్గొన్నారు.


బడి ఈడు పిల్లలందరూ బడుల్లోనే ఉండాలి



మాట్లాడుతున్న ఎంఈఓ పోకల తాతయ్య

కల్లూరు, జూన్ 15: బడి ఈడు పిల్లలందరూ బడుల్లోనే ఉండాలని తహసీల్దార్ వసంతలత, ఎంఈవోలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో 'నేను బడికి పోతా 'కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ డ్రాపౌట్ పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఏవో సుగుణమ్మ, హాస్టల్ వార్డెన్లు నవీన్, మల్లీశ్వరి, సీఆర్పీలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న రాస్ కౌన్సిలర్ నాగరాజ

రొంపిచెర్ల, జూన్ 15: విద్యార్థి దశలో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మత్తు బానిసల పునరావాస కేంద్రం కౌన్సిలర్ పి.నాగరాజ అన్నారు. శనివారం రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తుపదార్థాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం లోకనాథరెడ్డి, మునిలక్ష్మి పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు: వైసీపీ

పలమనేరు/వి.కోట, జూన్15 : ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమిపై ఎవరూ అధైర్యపడొద్దని అందరికీ అందు బాటులో ఉంటానని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలియ జేశారు. శనివారం పలమనేరు వైసీపీ కార్యాలయంలో నియోజకవర్గ వైసీపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు ఎవరూ కక్షలు పెంచుకొని ఘర్షణలకు దిగకుండా సంయమనం పాటించాలని కోరారు.

● ఫలితాలతో వైసీపీ కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. ఆయన స్వగ్రామమైన తోటకనుమలో వి.కోట మండల పరిధి వైసీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ బాలగురునాథ్, వైస్ ఎంపీపీ డా.తమీంఖాన్ పాల్గొన్నారు.

ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

యాదమరి, జూన్ 15: వరదరాజ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి తీర్థ వారి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మూలవర్లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం కల్యాణవేదికలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం ఆలయం ముందు మూడునదులు కలిసేచోట పచ్చని పందిళ్ల కింద శ్రీదేవి, భూదేవి సమేత



ఊరేగుతున్న ఇంద్రవరదుడు

ఇంద్రవరదుని ఉత్సవవిగ్రహాలను కొలువుదీర్చారు. ఉత్సవమూర్తులతో పాటు స్వామివారికి చక్రానికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ అర్చకులు మూడు నదులు కలిసే ప్రాంతంలో చక్రస్నానం చేయించారు. అనంతరం భక్తులు, అర్చకులు పుణ్యతీర్థంలో సాన్నమాచరించారు. రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆదివారం పుష్పపల్లకి సేవ నిర్వహించనున్నట్లు ఆలయ బ్రహ్మోత్స కమిటీ సభ్యులు తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయం వద్ద దుప్పట్ల పంపిణీ



చిత్తూరు రూరల్, జూన్ 15: నగరంలోని తేనబండ ముత్యాలమ్మ దేవాలమం వద్ద మాజీ కౌన్సిలర్ పార్థసారథినాయుడు శనివారం యాచకులకు దుప్పట్లు పంపిణి చేశారు. ముత్యాలమ్మ జాతర సందర్భంగా సుమారు 100 మందికి అనాథలకు, యాచకులకు దుప్పట్లు అందజేశారు.

కార్మికుల సమస్యలపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి సురేంద్రన్

చిత్తూరు రూరల్, జూన్ 15: కార్మికుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్ తెలిపారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కార్మికుల సమస్యలను లేబర్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలపై చర్చకూడా లేదన్నారు. కొత్తగా ఎన్నికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికల కష్టాలను పట్టించుకోవాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ అనుబంధ యూనియన్ నాయకులు గంగ, జ్యోతి, శోభ, ఎర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహాభారత ఉత్సవాలు ప్రారంభం

పాలసముద్రం, జూన్ 15: క్రిష్ణజిమ్మాపురంలోని ద్రౌపతీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో మహాభారత మహోత్సవాల్లో భాగంగా శనివారం భారతాన్ని ప్రారంభించారు. పగటిపూట భాగవతారిణి షణ్ముఖి హరికథ, రాత్రిపూట వెంకటేశ్వర నాట్యమండలి వీధి నాటకాలు రోజూ ఉంటాయని గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమాలకు ఉభయదారులుగా రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు కుటుంబ సభ్యులు, ఆలయ ధర్మకర్త బాలయ్య నాయుడు కుటుంబసభ్యులు వ్యవహరిస్తున్నారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న బాధితుడు రవి

చిత్తూరు, జూన్ 15: తన స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తేజ స్వీట్‌స్టాల్ అధినేత రవి డిమాండ్ చేశారు. గతంలో బాడుగకు తీసుకున్న ఇంటి స్థలాన్ని ఖాళీచేయకుండా బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ స్థలం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్చివీధిలో ఓ ఇంటిని 2015లో కొన్నానన్నారు. అది శిథిలావస్థకు చేరుకోవడంతో కూలగొట్టాలనుకున్నామన్నారు. ప్రసన్నకుమార్ అనే వ్యక్తితోపాటు మరికొంతమంది ఈ స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తూ బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

డైట్‌లో సర్టిఫికెట్ల పరిశీలన



కార్వేటినగరం, జూన్ 15: కార్వేటినగరం ప్రభుత్వ డైట్‌లో డీఎడ్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను శనివారం పరిశీలించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మండలాల నుంచి ఎంపికైన అభ్యర్థులు దూర ప్రాంతాల నుంచి వచ్చారు. కార్వేటినగరం పోలీస్ స్టేషన్ నుంచి డైట్‌కు వెళ్లడానికి కిలోమీటర్ దూరం. అభ్యర్థులు సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డారు. కొంతమంది చంటిపిల్లలతో వచ్చి మరింత ఇబ్బంది పడ్డారు. చెంగల్‌రాజు ఆధ్వర్యంలో ఈ సర్టిఫికేట్ల పరిశీలన కార్యక్రమం జరిగింది.

కేసులకు భయపడకండి: టీడీపీ నేతలు

గుడిపాల, జూన్ 15: మండిక్రిష్టాపురం దళితవాడలో బెయిల్‌పై వచ్చిన చంద్రశేఖర్ కుటుంబాన్ని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ పరామర్శించారు. కేసులకు భయపడవద్దని, కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, ఎంపీటీసీ గోళ్ళహరిప్రసాద్ చౌదరి, టీడీపీ నాయకులు నాగరాజ్ యాదవ్, రవి నాయుడు, సాంబశివ నాయుడు, శంకర్ చౌదరి, అరుణ్, చల్లా, ధనసింగ్, పృథ్వి, రాజశేఖర్ రెడ్డి, మధుసూధన్ నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సన్నిధిలో సత్తెనపల్లె ఎమ్మెల్యే

ఐరాల(కాణిపాకం), జూన్ 15: సత్తెనపల్లె ఎమ్మెల్యే కన్నాలక్ష్మీనారాయణ శనివారం కాణిపాకం వరసిద్ధుడ్ని దర్శించుకున్నారు. సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆయన్ను వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



పూతలపట్టు, జూన్ 15: చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి జన్మదిన వేడుకలను ఆయన అనుచరులు, గోపి యూత్ సభ్యులు, టీడీపీ నేతలు పలుచోట్ల భారీ కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. వావిల్‌తోట ఉన్నత పాఠశాలలోని వందమంది విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. మండల కేంద్రంలో అన్నదానం నిర్వహించారు. నాయకులు మధు, జగన్నాథం, రామూర్తి నాయుడు, నాదముని, నరసింహులు, కిరణ్ రెడ్డి, నరసింహులు, క్రిష్ణమూర్తి, దయా, రెడ్డప్ప రెడ్డి, భార్గవ్, మోహన్, హరి, హిమగిరి నాయుడు, చంద్రమౌళి, సురేష్, దేవేంద్రరెడ్డిలతో పాటు పలువురు నాయకులు, గోపి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

కలెక్టర్‌ను కలిసిన పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్



చిత్తూరు కలెక్టరేట్, జూన్ 15: పూతలపట్టు నియోజకవర్గ శాసనసభ్యుడు కె. మురళీమోహన్ శనివారం కలెక్టర్ షన్మోహన్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరిస్తూ నియోజకవర్గంలో ఏర్పడ్డ సమస్యలను ఎమ్మెల్యే వివరించారు. సమస్యలు పరిష్కరించేందుకు తగు చొరవ చూపాలని కలెక్టర్‌ను ఆయన కోరారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



సురేష్‌బాబు (ఫైల్ ఫొటో)

నింద్ర, జూన్ 15: గుండెపోటుతో గణిత ఉపాధ్యాయులు సురేష్ బాబు(52) మృతి చెందారు. ఆయన నింద్రలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. శనివారం విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తూ గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు. విద్యార్థులు కేకలు వేయడంతో ఉపాధ్యాయులు వెంటనే నింద్రలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యసేవలు అందిస్తుండగా ఆయన మృతి చెందారు. సురేష్‌బాబు మృతికి ఎంఈఓలు, ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

19న ఆలయ హుండీ లెక్కింపు

ఐరాల(కాణిపాకం), జూన్ 15: ఈ నెల 19న వరసిద్ధుడి ఆలయ హుండీని లెక్కించనున్నట్లు ఈవో వెంకటేశు తెలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో స్వామి కానుకలను లెక్కించను ఆయన పేర్కొన్నారు. లెక్కింపు సందర్భంగా ఆలయ ఉద్యోగులు, సిబ్బంది ఎవ్వరు సెలవు పెట్టరాదన్నారు.

జగన్మోహన్ విజయంపై తిరుమలకు పాదయాత్ర



చిత్తూరులో పాదయాత్ర ప్రారంభిస్తున్న మురళీమోహన్

చిత్తూరు కల్చరల్, జూన్ 15: అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యే జగన్మోహన్‌కు శుభం కలగాలని ఆకాంక్షిస్తూ గుడిపాల మండలం కోలావూరు మహిళలు తిరుమలకు పాదయాత్రగా బయలు దేరారు. పాదయాత్ర శనివారం ఉదయం చిత్తూరుకు చేరుకుంది. వారికి చిత్తూరు ఎమ్మెల్యే స్వాగతం పలికి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం చిత్తూరు హైరోడ్డు సుందర వినాయక ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పొన్నియమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించారు. గుడిపాల మాజీ మండలాధ్యక్షుడు బాలాజీ, మాజీ జడ్పీటీసీ సుమతి తదితరులు పాల్గొన్నారు. **గుడిపాల:** ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సొంత గ్రామం కోలావూరులో ఆయన తల్లిదండ్రులు రజనీ, చెన్నకేశవులు నాయుడు కోదండరామాలయంలో శనివారం అభిషేకాలు చేయించి తీర్చుకున్నారు.

రేపు కొంగారెడ్డిపల్లెలో అన్న క్యాంటీన్ ప్రారంభం



అన్న క్యాంటీన్ భవనానికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

చిత్తూరు సిటీ, జూన్ 15: అన్నా క్యాంటిన్ పునఃప్రారంభానికి జరుగుతున్న పనులను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పరిశీలించారు. శనివారం స్థానిక కొంగారెడ్డిపల్లెలోని అన్న క్యాంటిన్‌ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఈనెల 17న కొంగారెడ్డిపల్లెలోని అన్న క్యాంటీన్ అన్న క్యాంటీన్ పునః ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వాసుపత్రి, అంబేడ్కర్ సర్కిల్, కలెక్టరేట్, మురకంబట్టు ప్రాంతాల్లో కూడా అన్న క్యాంటీన్ ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

18, 19 తేదీల్లో నడివీధి గంగజాతర

చిత్తూరు కల్చరల్, జూన్ 15: నగరంలోని న్యూ ప్రశాంత్‌నగర్‌లో ఈనెల 18, 19 తేదీల్లో 14వ వార్షికోత్సవ గంగజాతర నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న అమ్మవారికి పొంగళ్ళు, అంబలి సమర్పణ, కుంభ నైవేద్యం నిర్వహించనున్నారు. 19న అమ్మవారికి ఓం శక్తి భక్తులు పూమాల సమర్పణ. జలధివాసం నిర్వహిస్తారన్నారు.

చంద్రబాబు సారథ్యంలో ఇక ప్రజాహిత పాలన

● సీఎం చిత్తశుద్ధితో హామీలు నెరవేరుస్తారు ● ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్రకుమార్, మురళీమోహన్,తదితరులు

చిత్తూరు సిటీ, జూన్ 15: ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ చిత్తశుద్ధితో అమలు చేస్తారని ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్(చిత్తూరు), మురళి మోహన్ (పూతలపట్టు), టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, రాష్ట్ర అధికారప్రతినిధి సురేంద్రకుమార్ చెప్పారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఇకపై ప్రజాహిత కార్యక్రమాలే ఉంటాయన్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన రోజే చంద్రబాబు కీలకమైన ఐదు అంశాలపై సంతకాలు చేసి అమల్లోకి తీసుకురావడం దేశంలోనే మొదటి సారి అని పేర్కొన్నారు. చంద్రబాబు ఎన్నికల ముందు చెప్పిన విధంగా మొట్టమొదటి సంతకం మెగా డీఎస్సీ, రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, మూడో సంతకం పెన్షన్లు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంపు, నైపుణ్య గణనకు నాలుగో సంతకం, అన్న క్యాంటీన్‌ల పునరుద్దరకు ఐదో సంతకం చేశారన్నారు. మాజీ సీఎం జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. అందుకే వైసీపీని ప్రజలు చిత్తుగా ఓడించారని చెప్పారు. ముఖ్యంగా ఏటా మెగా డీఎస్సీ ప్రకటిస్తానని నిరుద్యోగుల్లో ఆశలు నింపి నిండా ముంచారన్నారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ చట్టం ద్వారా ప్రజల భూములను కాజేసేందుకు వైసీపీ నేతలు, కొందరు అధికారులు భారీ కుట్రపన్నారన్నారని ఆరోపించారు. ప్రజలు వైసీపీ కుట్రలను తిప్పికొట్టి సరైన బుద్ధి చెప్పారన్నారు. ఇటీవల మాజీ సీఎం జగన్ పార్టీ నేతలతో చంద్రబాబు వంద తప్పులు చేసేదాకా చూద్దామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు ఎప్పటికీ తప్పుచేయరన్నారు. తప్పుచేసేవారిని ప్రోత్సహించరని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇకపై ప్రజాహిత కార్యక్రమాలే ఉంటాయన్నారు. కక్ష సాధింపు చర్యలు ఉండవన్నారు. కోదండయాదవ్, మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు మోహన్‌రాజ్, వెంకటేష్ యావ్, సునీల్ కుమార్ చౌదరి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరును క్లీన్‌సిటీగా చేద్దాం: ఎమ్మెల్యే



రంగాచారి వీధిలో మురుగు కాలువ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు, జూన్ 15: నగరాన్ని క్లీన్‌సిటీగా చేద్దామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన 42వ వార్డులోని వన్నియర్‌బ్లాక్, 44వ వార్డులోని రంగాచారివీధిలో పర్యటించారు. పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. స్థానిక మహిళలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీకాలువలు, దెబ్బతిన్న కల్వర్టుల సమస్యలను తన దృష్టికి తీసుకురావడంతో అక్కడికక్కడే అధికారులతో చర్చించారు. తాగునీటి పైపులైన్లు అధికంగా ఉన్నచోట్ల పెద్దపైపు ఒకటే ఉండేలా చూడాలన్నారు. కాలువల్లో పూడికతీతను తీయాలని ఆదేశించారు. సామిరెడ్డివీధి, గోల్డ్‌మార్కెట్, ఫిష్‌మార్కెట్, కూరగాయల మార్కెట్, హాస్పిటల్ రోడ్డులో పారిశుధ్య పనులు, మురుగునీటి కాల్వలను పరిశీలించారు. గ్యాంగ్‌వర్క్‌ల ద్వారా కాలువల్లో పూడిక తొలగించే పనులను చేస్తామని కమిషనర్ అరుణ తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలు, ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వార్డుల్లో పర్యటించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై వినతిపత్రం రూపంలో ఇస్తే తక్షణం చర్యలు చేపడతామన్నారు. ఇదే తరహాలో రోజువారీ పర్యటిస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ అరుణ, సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, హౌసింగ్ ఏఈ శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలీసు సంక్షేమంపై నివేదిక: ఎస్పీ మణికంఠ



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు, జూన్ 15: ఉద్యోగంతో పాటు సంక్షేమం కూడా ముఖ్యమని ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. శనివారం ఏఆర్ పెరేడ్ మైదానంలో ఏఆర్, ఎస్టీఎఫ్‌తోపాటు పలు విభాగాల సిబ్బందితో పెరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతే సిబ్బంది బాగోగులపై నివేదికను ఇవ్వాలని కోరారు. ఏఆర్ ఉద్యోగ నిర్వహణ కష్టతరమైందన్నారు. అలాగే బాధ్యతాయుతమైందన్నారు. ఎస్కార్ట్, బందోబస్తు, గన్‌మ్యాన్ ఉద్యోగాలు చేసే వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏఆర్ సిబ్బంది చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, వ్యాయామం చేయాలని సూచించారు. పోలీసుల సంక్షేమానికి అవసరమైన పనులను అధికారులు చేస్తున్నారని తెలిపారు. ఆర్మ్‌డ్ రిజర్వు ఆఫీస్‌ను పరిశీలించారు. ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీలు మహబూబ్ బాష, ఇలియాస్ బాష, ఆర్ఐలు భాస్కర్, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నగరిలో ఘనంగా 'ఆశా' ఆవిర్భావ వేడుకలు



సమావేశంలో ప్రసంగిస్తున్న భానుప్రకాష్

నగరి జూన్ 15: స్థానికంగా ఓప్రయివేటు కళ్యాణ మండపంలో శనివారం ఆశా ఆవిర్భావ దిన వేడుకలను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఏ గాలి భానుప్రకాష్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో శిశుమరణాల సంఖ్య గణనీయంగా తగ్గిందంటే ఆశ వర్కర్ల పనితీరే అందుకు నిదర్శనమన్నారు. గ్రామం నుంచి పట్టణ స్థాయి వరకు ప్రజలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడంలో ఆశా వర్కర్ల కృషి ఎంతో ఉందన్నారు. ఎమ్మెల్యేను ఆశావర్కర్లు సన్మానించారు. ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం అందించారు.

అప్పుల బాధ తాళలేక మహిళ మృతి



విగత జీవిగా సుమిత్ర

పుంగనూరు రూరల్, జూన్15: అప్పులు తీర్చలేక అప్పు ఇచ్చిన వారి వేధింపులు తాళలేక ఓ మహిళ పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి పుంగనూరులో జరిగింది. కుటుంబసభ్యుల కథనం మేరకు.. తూర్పు మొగసాలకు చెందిన సుందరరాజు, భార్య సుమిత్ర (35) కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవారు. ఇటీవల ఇంటి ఖర్చులు, కుమార్తె వివాహం కోసం అప్పులు చేశారు. అప్పుల వారి వేధింపులు అధికం కావడంతో పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయింది. గుర్తించిన కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

సింహ వాహనంపై వేణుగోపాలుడి విహారం

గుడుపల్లె, జూన్ 15: శెట్టిపల్లెలోని వేణుగో పాలుడు సింహ వాహ నంపై శనివారం వైభవంగా ఊరేగారు. మండలంలోని శెట్టిపల్లె వేణుగోపాలస్వామి ఆల యం వార్షిక ఉత్సవాలలో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి విశేష అభిషేకాలు, పూజలు చేశారు. వివిధ పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వేణుగోపాలుడి ఉత్సవర్లను పట్టువస్త్రాలు, ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి సింహ వాహనంపై ఆశీనుల్ని చేసి మంగళ వాయిద్యాలతో గ్రామ వీధుల్లో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి కర్పూర హారతులు సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.

భక్తి ప్రపత్తులతో అమ్మవారికి జలాభిషేకం

చిత్తూరు కల్చరల్, జూన్ 15: నగరంలోని తేనేబండ ముత్యాలమ్మ ఆలయంలో ఐదు రోజులుగా అమ్మవారి జాతర ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం నీవానదిలో జలధివాసం నిర్వహించారు, అనంతరం రాత్రి అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు ఆర్. యుగందర్ బాబు, ఆలయ ఈవో తిమ్మారెడ్డిలు అమ్మవారికి శాంతి పూజలు చేసి అగ్నిగుండం వెలిగించారు. ఉత్సవ మూలవిరాట్టును అగ్నిగుండం చుట్టూ మూడుసార్లు త్రిప్పి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు గణేశన్‌తో పాటు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రేపు జంతు బలి నిషేధం: కలెక్టర్

చిత్తూరు కల్చరల్, జూన్ 15: బక్రీద్‌ను సోమవారం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రభుత్వ ఖాజీ కమాలుల్లా జుహారి జునైది శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దానాలు చేసి అల్లా ఆశీస్సులు పొందాలని కోరారు. ఆరోజు నగరంలోని జంతుబలుల నిషేధం ఉందని కలెక్టర్ షన్మోహన్ స్పష్టం చేశారు. శనివారం ఆయన అధికారులతో, ముస్లిం మత పెద్దలతో సమీక్ష నిర్వహించారు. కాగా నగరంలోని రెడ్డిగుంట, మురకంబట్టు తదితర ప్రాంతాల్లో పొట్టేలు, మేక పోతుల వ్యాపారాలు అధికంగా జరిగాయి.

మృతిచెందిన విద్యార్థులకు నివాళులు



విద్యార్థుల మృతదేహాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

బంగారుపాళ్యం, జూన్ 15: తిరుపతి-బెంగళూరు జాతీయ రహదారిలోని చెర్లోపల్లి వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పవన్‌కల్యాణ్, మంజు, చరణ్ తేజ్‌లకు శనివారం మహాసముద్రం గ్రామంలో ఒకే చోట అంత్యక్రియలు నిర్వహించారు. ఈ గ్రామానికి చెందిన వీరు ముగ్గురూ స్నేహితులు. విద్యార్థుల మృతదేహాలను చూసి స్నేహితులు, గ్రామస్థులు విలపించారు. ఎమ్మెల్యే మురళీ మోహన్, క్లస్టర్ ఇన్‌చార్జి ధరణీనాయుడు, నాయకులు జనార్దన్ గౌడ్, కుప్పాలమురళి మహేంద్ర, పెరుమాళ్, సూరి, జయరామ్‌రెడ్డి తదితరులు మృతదేహాలకు నివాళులర్పించారు.

మాజీ ఎమ్మెల్యే మనోహర్‌కు పార్టీ నాయకుల సన్మానం



చిత్తూరు సిటీ, జూన్ 15: మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్‌ను టీడీపీ కూటమి నేతలు శనివారం ఘనంగా సన్మానించారు. ఇటీవల ఎన్నికల్లో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ గెలుపునకు కృషిచేసినందుకు 25వ డివిజన్ నేతలు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో 25వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ శంకర్, పార్టీ నాయకులు రమేష్, శేఖర్, నాగేశ్వరరావు, బీజేపీకి చెందిన రామ్మూర్తి, జనసేన నేత జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

వన వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకం



వెదురుకుప్పం, జూన్ 15: వెదురుకుప్పం మండలం దేవరగుడి పల్లె-ఆడారెడ్డి పల్లె సమీపంలోని వన వేణుగోపాలస్వామికి శనివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రధాన అర్చకులు కె.కార్తీక్ అయ్యంగార్ 'స్వామి'కి ప్రత్యేక పూజలు నిర్వహించి అలంకరించారు. ఈ క్రమంలో క్షీరాభిషేకం, అర్చన, ప్రత్యేక పూజాది కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం చేశారు. ప్రధాన కార్యనిర్వాహకులు శివకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లక్ష్మీ నరసింహస్వామికి పూజలు

వెదురుకుప్పం, జూన్15: చిన్నమరెడ్డికండ్రిగలోని లక్ష్మీ నరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త మిట్టపల్లి మంజుల, సుబ్రహ్మణ్యం దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇంటింటికీ స్వీట్లు పంపిణీ చేసిన టీడీపీ నాయకులు

నగరి జూన్15: రాష్ట్రంలో టీడీపీ అత్యధిక సీట్లు సాధించి చంద్రబాబు సీఎం కావడంతో మాజీ కౌన్సిలర్ లత, తెలుగుదేశం నాయకులు రామానుజం చలపతి ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఒకటో వార్డు తెలుగు మహిళలు పాల్గొని ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆనందాన్ని పంచుకున్నారు. పలువురు తెలుగు మహిళలు పాల్గొన్నారు

చంద్రబాబు చిత్రపటానికి న్యాయవాదుల పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యేలు, న్యాయవాదులు

చిత్తూరు సిటీ, జూన్ 15: ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దుచేసినందుకు ధన్యవాదాలు తెలుపుతూ చిత్తూరు న్యాయవాదులు శనివారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళి మోహన్ ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అంతకు ముందు ఎన్టీయార్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ జగన్, వైసీపీ నేతలు, కొందరు అధికారులు ప్రజల భూములను దోచుకునే ఉద్దేశంతో పెట్టిందే ల్యాండ్ టైటిల్ యాక్ట్ అన్నారు. రాష్ట్రంలో మొదటి సారిగా న్యాయవాదులు ఈ చట్టంవల్ల వచ్చే ప్రమాదాన్ని గ్రహించి నెలల తరబడి ఆందోళన కార్యక్రమాలు చేపట్టామన్నారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీకి కట్టుబడి ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దుపై సంతకాన్ని చేశారన్నారు. చంద్రబాబుపై రాష్ట్ర ప్రజలకు అపారమైన విశ్వాసముందని చెప్పారు. పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మాజీ మేయర్ కటారి హేమలత, న్యాయవాదులు రామకృష్ణ, విజయభాస్కర్, వసంతకుమార్, జ్యోతిరామ్, బాలాజి, గోవిందరాజులు, మురళిమోహన్, త్రిమూర్తి, శరవణకుమార్ పాల్గొన్నారు.